రంగేలి

- నేడు హోలీ
- వసంతంలో తొలి పండుగ
- రెండ్రోజులపాటు వేడుకలు
- సహజ రంగులే మేలు
- రసాయనాలతో హాని

రామగుండంలో కామదహనం చేస్తున్న నగర వాసులు

రంగుల పండుగ హోలీ వచ్చేసింది. సప్తవర్ణాలతో వసంతమాడేందుకు ఊరూవాడా సిద్ధమైంది. స్నేహభావంతో ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ మనుషులంతా సమానమని చాటి చెప్పే కలర్‌ఫుల్ వేడుక కోసం పేదా గొప్ప, చిన్నాపెద్దా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నది. నేటి ఉదయం నుంచి రెండ్రోజులపాటు రంగుల ప్రపంచంలో తేలిపోనున్నది.

– కోల్‌సిటీ, మార్చి 24

ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకొనే పండుగ హోలీ. వసంత రుతువులో వచ్చే తొలి వేడుక ఇది. వసంతగమనాన్నీ, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ పాల్గుణ పౌర్ణమి రోజు జరుపుకునే ఈ పర్వదినాన్ని వసంతోత్సవం అనీ, పాల్గుణోత్సవం అని కూడా అంటారు. ఈ పండుగ రోజు చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా రంగులు చల్లుకుంటారు. ఎంతో సంబురంగా జరుపుకొంటారు. ఎప్పట్లాగే ఈ సారి హోలీని ఘనంగా జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు.

కామదహనం..

హోలీ అనగానే గుర్తొచ్చేది కాముని పున్నం. ఊళ్లలో పిల్లలు పది రోజుల ముందు నుంచే ఇంటింటా తిరుగుతూ జాజిరి ఆటలు ఆడుతారు. సేకరించిన డబ్బులు పంచుకుని, ధాన్యంతో వంటలు చేసుకుంటారు. హోలీ ముందు రోజు రాత్రి పది గంటల నుంచి కామదహనం నిర్వహిస్తారు. ఇన్ని రోజులు ఆడిన కోలలను అందులో వేస్తారు. శరీరంలోని చీడ, పీడలు వదిలి అందరికీ సర్వ సుఖాలు కలగాలని ఆశిస్తూ ఇంట్లోని పాత చెక్క వస్తువులు, కలపను చౌరస్తాలు, ప్రధాన ప్రాంతాల్లో చేర్చి దహనం చేస్తారు. మిగిలిన బూడిదను దిష్టి తగలకుండా బొట్టు పెట్టుకుంటారు. శారీరక, మానసిక ప్రశాంతత చేకూరాలని వేడుకుంటారు.

సహజ రంగులే మేలు..

మోదుగుపూలు జనవరి, ఫిబ్రవరి నెలల్లో విరగబూస్తాయి. ప్రాచీనకాలంలో రంగుల కోసం మోదుగ పూలు వాడేవారు. ఇవి చర్మానికి ఎంతో శోభ తెచ్చేవి. మోదుగపూలను ఎండబెట్టి దాని నుంచి రంగులు తయారుచేయవచ్చు. ఇది ఆరోగ్యానికి దోహదకారి మాత్రమే గాక, ఈ కాలంలో వచ్చే రోగాలకు దివ్యమైన ఔషధంలా పని చేస్తుంది. ఇంకా హెన్నా(మైదాకు పొడి), పసుపు, కుంకుమ, చందనం, టమాట గింజలతో తయారైన పొడిని నీళ్లలో కలిపి చల్లుకునే వారు. ఇలాంటి రంగులు పూసుకోవడం ద్వారా సంతోషం, ఆనందం కలుగుతాయి. అలాగాక రసాయనాలు కలిపిన రంగులు పూసుకోవడం వల్ల లేనిపోని చర్మరోగాలు అంటుకుంటాయి. కానీ, ఇప్పుడు ఎక్కడ చూసినా రసాయనిక రంగులే కనిపిస్తున్నాయి. వీటితో లేని పోని ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందుకే స్వచ్ఛమైన కుంకుమ, బుకా గుల్లాలు వంటి రంగులతో పండుగ జరుపుకొంటే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధర్మారం, మార్చి 24: ధర్మారం మండలం రచ్చపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం 2004-05 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేశారు. రోజంతా ఆటపాటలతో సందడిగా గడిపారు. తమకు విద్యా బోధన చేసిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు. మిత్రులంతా ఐక్యంగా ఉండాలని కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు రామ్ జాకర్, శ్రీలత, ప్రమిద, భాగ్యలక్ష్మి, లక్ష్మణ్, అంజయ్య, కొమురయ్య, మల్లేశం, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంతటి త్యాగానికైనా సిద్ధపడి పని చేస్తాం

గోదావరిఖని, మార్చి 24: సింగరేణి పరిరక్షణకు టీబీజీకేఎస్ ఎంతటి త్యాగానికైనా సిద్ధపడి పని చేస్తుందని సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కుల సాధన కోసం దశలవారీగా ఉద్యమ కార్యాచరణను అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు 30 మంది సభ్యులతో టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏప్రిల్‌లో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రాంమ్మూర్తి, పర్లపల్లి రవి, వెంకటేశ్, వడ్డెపల్లి శంకర్, సతీశ్, చెల్కలపల్లి శ్రీనివాస్, సురేందర్, సర్వోత్తమరెడ్డి, పులిపాక శంకర్, సాయి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో అర్ధరాత్రి ఉద్రిక్తత

- ఓల్డ్ అశోక్ థియేటర్‌ను కూల్చివేసిన బల్దియా అధికారులు

కోల్‌సిటీ, మార్చి 24: నగరంలోని లక్ష్మీ నగర్‌లో గల ఓల్డ్ అశోక్ థియేటర్‌ను బల్దియా అధికారులు శనివారం అర్ధరాత్రి కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో ఉందని పేర్కొంటూ థియేటర్‌తోపాటు అక్కడున్న రెండు హోటళ్లను వన్ టౌన్ పోలీసుల బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చివేశారు. థియేటర్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, విషయం తెలుసుకున్న పలువురు వ్యాపారులు, అధికార పార్టీకి చెందిన కొంతమంది కార్పొరేటర్లు అక్కడకు చేరుకొన్నారు. 50 ఏళ్లుగా ఉంటున్న ఓల్డ్ అశోక్ థియేటర్‌ను బల్దియా అధికారులు కావాలనే పథకం ప్రకారం కూల్చివేశారా? అన్న చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా గతంలో నలుగురు వ్యక్తులు అక్కడి ప్రభుత్వ స్థలాన్ని లీజు పద్ధతిన తీసుకొని థియేటర్ నిర్మించారు. అనంతరం వారి వద్ద నుంచి సబ్ లీజు వేముల అశోక్ అనే వ్యాపారి తీసుకున్నాడు. చాలా ఏళ్ల క్రితమే థియేటర్ మూతపడింది. థియేటర్ ఆవరణలో ప్రైవేట్ దుకాణాలు వెలిశాయి. ఈ క్రమంలో ఓ ప్రజాప్రతినిధి బల్దియా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో శనివారం అర్ధరాత్రి కూల్చివేశారు. కాగా, థియేటర్ చుట్టూ ఉన్న ప్రైవేటు దుకాణాలను కూడా రెండు రోజుల్లో కూల్చివేయడానికి అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ ఘటనపై లీజుదారుడు వేముల అశోక్ మాట్లాడుతూ, ఇదంతా పథకం ప్రకారమే జరిగిందనీ, కూల్చివేత సమయంలో తనకు అనుకూలంగా హైకోర్టు నుంచి లీజు గడువు పెంచుతున్నట్లు వచ్చిన నోటీసులను చూపించినప్పటికీ బలవంతంగా కూల్చివేశారని ఆరోపించారు. ఈ ఘటనపై గోదావరిఖని టౌన్ పోలీస్ స్టేషన్‌లో మేయర్, కమిషనర్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే, ఈ విషయమై కమిషనర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా స్పందించలేదు.

ఎమ్మెల్యే విజయరమణారావుకు వేములవాడ రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

వేములవాడ రాజన్న సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

పెద్దపల్లి టౌన్, మార్చి 24: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్, మార్చి 24: అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల వెంకటరెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకేసారి రూ.2లక్షల రైతు రుణమాఫీ, ఏటా ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, కౌలు రైతులకు రైతుభరోసా పథకాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రమాదవశాత్తు పలువురు రైతులు మరణించినా, వారికి బీమా వర్తింపజేయకపోవడం శోచనీయమన్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సత్కారం

జ్యోతినగర్, మార్చి 24: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను ఆదివారం ఎన్టీపీసీ టౌన్‌షిప్ గెస్ట్‌హౌస్‌లో ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. విశ్రాంతి ఉద్యోగుల సమస్యలపై వారు వినతిపత్రాన్ని అందజేశారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మారం, మార్చి 24: మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవానికి హాజరుకావాలని ధర్మపురిలోని క్యాంప్ కార్యాలయంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శంకరయ్య, పద్మశాలీ సంఘం సభ్యులు రవీందర్, కైలాసం, అంజి, మణిశర్మ ఉన్నారు.

నేత్ర, అవయవ దానంపై అవగాహన

కమాన్‌పూర్, మార్చి 24: కరీంనగర్‌లో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సేవా సమ్మేళనంలో కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు నేత్ర, అవయవదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమాన్‌పూర్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి నల్లవెల్లి శంకర్, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, శరత్ రావు పాల్గొన్నారు.

అభినందన పత్రం అందజేత

రామగిరి, మార్చి 24: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కురుమల్ల భూమయ్య ఈనెల 14న మృతి చెందాడు. కుటుంబ సభ్యులు భూమయ్య నేత్రాలు దానం చేశారు. కాగా, ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూమయ్య సంస్మరణ సభ నిర్వహించారు. భూమయ్య కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు.

క్రీడాకారిణికి అభినందన

విజయకేతనం చూపుతున్న చికిత

పెద్దపల్లి, మార్చి 24: ఖేలో ఇండియా ఎన్టీపీసీ సౌత్ జోన్ ఓపెన్ అర్చరీ టోర్నమెంట్‌లో ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన కానిపర్తి చికిత ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచింది. కాగా, చికితను పలువురు అభినందించారు.

మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడికి సత్కారం

పెద్దపల్లి టౌన్, మార్చి 24: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొలిపాక నర్సయ్యను పట్టణంలోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్, జర్నలిస్టులు మారుపాక అంజి, తిర్రి సుధాకర్‌గౌడ్, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, రాజు, వంశీ, మామిడాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

మంథని రూరల్, మార్చి 24: బిట్టుపల్లి గ్రామంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలను పట్టుకుని ర్యాలీ తీశారు. పాస్టర్ గద్దల రాజేశ్, సంఘ పెద్దలు మంథని సదానందం, వెంకటేశ్, శంకర్, తరుణ్, వరుణ్ పాల్గొన్నారు.

ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు

నగరంలో తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

ఎల్ఎండీలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- మానేరు డ్యాంలో నీటి నిల్వ పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది
- మహిళలు మళ్లీ బిందెలు పట్టుకొని రోడ్లపైకి వచ్చే పరిస్థితి తేవద్దు
- ప్రభుత్వానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచన
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి ఎల్ఎండీలో నీటి నిల్వల పరిశీలన

కార్పొరేషన్, మార్చి 24: వేసవి కాలంలో నగరంలో ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తాగునీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ మానేరు డ్యాంలో నీటి నిల్వలను మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానకొండూర్‌తో పాటు నగరం చుట్టు పక్కల గ్రామాలకు తాగునీరు అందించే మానేరు డ్యాంలో నీటి నిల్వలు పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ కూడా మార్చిలో నీటి నిల్వలు ఇంతలా పడిపోవడం చూడలేదన్నారు. ప్రస్తుతం ఎల్ఎండీలో 5.3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎల్ఎండీ ద్వారా తాగునీటి అవసరాలు తీర్చిన తర్వాతే దిగువకు సాగునీరు అందించాలని జీవో ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మిషన్ భగీరథ కోసం ఎల్ఎండీలో 13 టీఎంసీలు, మధ్యమానేరులో 6.5 టీఎంసీల నిల్వలు తగ్గకుండా చూశామని తెలిపారు. తాము తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చామని, తర్వాత పంటలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో మధ్య మానేరు, ఎల్ఎండీ నీటితో నిండుకుండల్లా ఉండేవని గుర్తు చేశారు. నగరంలో ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేయడంతోపాటు 24 గంటల పాటు నిరంతరం సరఫరా కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో మండు టెండల్లో కూడా చెరువులు మత్తడి దుంకాయని చెప్పారు. నేడు ఎల్ఎండీలో నీటి నిల్వలు పడిపోవడంతో నగరంలోని బోరింగ్‌లు కూడా పని చేయడం లేదన్నారు. ఇప్పటికే నగరంలో నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని, ఎల్ఎండీలో నీటి నిల్వ పడిపోవడం వల్ల బూస్టర్ పంపుల ద్వారా నీటిని అందించడం సాధ్యపడడం లేదని తెలిపారు. మహిళలు మళ్లీ బిందెలు పట్టుకొని రోడ్లపైకి వచ్చే పరిస్థితి తేవద్దని ప్రభుత్వానికి సూచించారు. జిల్లాకు చెందిన మంత్రులు, సీఎం వెంటనే స్పందించి, ఎల్ఎండీ నుంచి దిగువకు నీటి విడుదలను నిలుపుదల చేయించాలన్నారు. డ్యాంలో ప్రస్తుతం ఉన్న ఐదు టీఎంసీలకు మరో రెండు టీఎంసీలను మధ్యమానేరు నుంచి విడుదల చేస్తే కరీంనగర్‌లో ప్రజలకు రోజూ గంటపాటు తాగునీరు సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ మల్లేశ్

కమాన్‌చౌరస్తా, మార్చి 24 : శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో వివిధ విభాగాలు విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ సంకశాల సూచించారు. ఆదివారం శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కోర్సులు రీసెర్చ్ స్కాలర్లకు పరిశోధనలో చాలా ఉపయోగపడుతాయన్నారు. వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆచార్య చన్న బసవయ్య మాట్లాడుతూ, సమాజంలోని సమస్యలకు పరిశోధనల ద్వారా పరిష్కారాలు చూపే గొప్ప బాధ్యత ప్రతి రీసెర్చర్‌పై ఉందన్నారు. దాన్ని ఎంతో నైపుణ్యంతో నిర్వర్తించేందుకు ఇలాంటి కోర్సులు వారికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ, ఇలాంటి కోర్సు నిర్వహించడానికి తనను ప్రోత్సహించిన శాతవాహన అధికారులు, ఈ కోర్సులో చేరి విజయవంతం చేసిన రీసెర్చ్ స్కాలర్స్ అందరినీ అభినందించారు. కార్యక్రమంలో కోర్సు కో డైరెక్టర్ డాక్టర్ ఈ మనోహర్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం మనోజ్ కుమార్, కృష్ణ కుమార్, డాక్టర్ కే తిరుపతి, అజీజ్, విజయ్, సావిత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రేరణ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

హుజూరాబాద్ టౌన్, మార్చి 24: తెలంగాణ కామర్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రేరణ పోటీల్లో హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. రంగోలి పోటీల్లో పాల్గొని తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ ఇందిరాదేవి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ ఇందిరాదేవి, వాణిజశాస్త్ర విభాగం ఇన్‌చార్జి లక్ష్మీనరసింహమూర్తి, వాణిజ్యశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, ఐక్యేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పీ దినకర్, అధ్యాపకులు అభినందించారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి

పెద్దపల్లి టౌన్, మార్చి 24: జిల్లాలో మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సానికొమ్మ రాంరెడ్డి అధికారులను కోరారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట, అందుగులపల్లి, రాఘవపూర్, గౌరెడ్డిపేట, జోజన్నపేట్, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో అక్రమంగా మట్టి తీస్తూ అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

పండ్ల పంపిణీ

జ్యోతినగర్(రామగుండం), మార్చి 24: పెద్దంపేటకు చెందిన ఆముల పరశురాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఆయన సోదరుడు అంతర్గాం జడ్పీటీసీ ఆముల నారాయణ రామగుండంలోని తబితా ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఇక్కడ రాములు, లక్ష్మణ్ గౌడ్, మహేందర్‌రెడ్డి, మల్లేశ్, సొల్లు రాజు, తదితరులున్నారు.

రామగుండంలో కామ దహనం

జ్యోతినగర్(రామగుండం), మార్చి 24: హోలీ పండుగను పురస్కరించుకొని ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద పిల్లలు, పెద్దలు కేరింతలు కొడుతూ కామ దహనం చేశారు. కార్యక్రమంలో జాగటి శ్రీకాంత్‌కుమార్, నీలం నాగభూషణం, వనగంటి రవిచందర్, గుర్రాల నరసింహా, తోకల రాయమల్లు, శ్రీనివాస్, రవికుమార్, సత్యనారాయణ, కుమార్, కుమార్, ముత్యాల శంకర్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఓదెలకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు

ఓదెల, మార్చి 24: ఓదెలలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరైనట్లు హైకోర్టు న్యాయవాది పొలాస శంకర్ తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి ఓదెలలో కోర్టు ఏర్పాటు చేయాలని గతంలో తాను న్యాయశాఖ మంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రిజిస్ట్రార్ జనరల్, న్యాయశాఖ కార్యదర్శికి విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఓదెలలో కోర్టు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని, ఇందుకు సంబంధించి జీవో కూడా జారీ చేసినట్లు వివరించారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

జూలపల్లి, మార్చి 24: కుమ్మరికుంటలో నూతనంగా నిర్మించిన రామాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం కనుల పండువగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఊరేగించారు. వేడుకల్లో ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, తాజా మాజీ సర్పంచ్ మేచినేని సంతోశ్‌రావు, నాయకులు కుంట రాజేశ్వర్‌రెడ్డి, కొత్త మల్లేశం, కామరాజు, దిడ్డి శంకరయ్య, ఓరుగంటి రవీందర్‌రావు, ఎల్కపెల్లి రాజు, శాతళ్ల కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

పట్నం వేస్తున్న భక్తులు

ఓదెల, మార్చి 24: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో వివిధ దూర ప్రాంతాల నుంచి భక్తులు రైళ్లు, బస్సులు, ప్రత్యేక వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ఆవరణలో పట్నం వేసి, బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుకుండా ఆలయ ఈవో సదయ్య ఏర్పాట్లు చేశారు.

'మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్'

కోల్‌సిటీ, మార్చి 24: కాంగ్రెస్ పార్టీకి మాదిగలంటే లెక్కలేదనీ, లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం మాదిగలకు కేటాయించకుండా మళ్లీ మోసం చేసిందని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వాసంపల్లి ఆనంద్‌బాబు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మూడు తరాలుగా పెద్దపల్లి ఎంపీ సీటు కాక కుటుంబానికే కట్టబెడుతున్నదని ఆరోపించారు. పూటకో పార్టీలు మార్చే వివేక్ కుటుంబానికి అగ్రతాంబూలం ఇచ్చి కుటుంబ పాలనను పోషిస్తున్నదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలంతా ఒక్కటై తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వారి వెంట నాయకులు మామిడిపల్లి శ్రీనివాస్, సుందిళ్ల సంతోష్, చిలుముల సంతోష్, నర్సింగ్, ధర్మయ్య, రాజయ్య, కుమార్, మహేందర్, రాంబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి, మార్చి 24: పెద్దాపూర్ గ్రామానికి చెందిన కల్లెపెల్లి అశోక్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పరామర్శించారు. 'నేనున్నా' ఫౌండేషన్ తరపున బాధిత కుటుంబానికి రూ. 5 వేల నగదు అందజేశారు. ఇక్కడ నాయకులు తొగరు శ్రీనివాస్, గడ్డమీది శ్రీనివాస్, కొండపెల్లి కృష్ణమూర్తి, బొజ్జ మల్లయ్య, వెంకటేశ్, దాడి నాగరాజు, జేకే శేఖర్‌యాదవ్, నరేశ్ ఉన్నారు.

శ్రీరాంనగర్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

ట్యాంకు ఆవరణను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రమాసురేశ్‌రెడ్డి

మంథని, మార్చి 24: పట్టణంలోని శ్రీరాంనగర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమాసురేశ్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులో కలియ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ పైపు లైన్లు సరిగ్గా లేక తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన చైర్‌పర్సన్ భగీరథ ఏఈకి సమస్యను వివరించి పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు నక్క నాగేంద్ర, శంకర్, వీకే రవి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జ్యోతినగర్(రామగుండం), మార్చి 24: రామగుండం, పెద్దంపేట రైల్వే స్టేషన్ మార్గంలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి (35-40 సంవత్సరాల వయస్